ప్రత్యక్షంలో పరోక్షం

వసంతశోభతో కలకలలాడే ఉద్యానవనం! మామిడిగున్నపై దోబూచులాడే పికసంతానం! అనురాగాన్ని తీర్చిదిద్దే సంధ్యారాగం! కుసుమసౌరభంతో గుబాళిస్తున్న పిల్ల తెమ్మెరలు! మకరందాస్వాదనలో మైమరచిన మత్తమధుపాలు! మాలతి పందిరిక్రింద పత్రికను చదువుతున్న అరుణం!......ఏది మనకథావస్తువు? దేనిని పరిగ్రహిస్తే మన కథాకథనానికి సదవకాశం కుదురుతుంది?

కథాకథనానికి ప్రకృతిసౌందర్యం కేవలం అలంకారం మాత్రమే. ఆ అలంకారముల నడుమ అలరారుతున్న అమ్మాయిచరిత్రనే మనం పరిగ్రహిద్దాం!

"జ్యోత్స్న" అను మాసపత్రికను చదువుతోంది అరుణం. సన్నజాజి సౌరభంకంటె ఆపత్రిక ఎన్నోరెట్లు ఆనందాన్నిస్తుంది తనకు. ముఖ్యంగా కరుణంగారి మధుర కథానికను ముదముతో చదువుతోందామె. కరుణంగారి కథలంటే ఆమెకెంతో ప్రీతి. కరుణం ఎక్కువ పత్రికలకు కథలు పంపడు. ఆమెకూడ ఎక్కువపత్రికలుకొని చదువదు. సాహితీరంగములో ధృవతారలవలె ప్రకాశిస్తున్న "జ్యోత్స్న" "ఆర్ణతం" "మరాళం" అను మూడుపత్రికలకే కరుణం కథలు రాస్తాడు. ప్రతి నెల ఆ మూడు పత్రికలనేకొని చదువుతోంది అరుణం. కరుణంగారి కథలు మొదట చదవనిదే ఇతర కథలు చదవదామె. అతనికథలలో అనేక ప్రత్యేకతలను ఆమెకనుగొన్నది. అతనికథలు చదువుతున్నప్పుడెల్లా ఎవరీకరుణం? ఏవూరు? ఏమిచదుకొన్నారు? ఉద్యోగమేమిటి? ఏపాటి వయస్సు? వివాహితుడేనా?...ఇలాంటిప్రశ్నలు ఎన్నో ఆమె మెదడులో కదిలేవి.

ప్రస్తుతము "జ్యోత్స్న" పత్రికలో ఆమె చదువుతున్నది కరుణంగారి "నివాళి" కథ. వాహ్యాళికేగివచ్చిన ఇల్లాలికి నివాళినిచ్చే పెట్టమారిమగణ్ణి కథానాయకునిగా సృష్టించి కథను చక్కగా పోషించాడు కరుణం. తుదకు 'చెడిపకెన్నడైన—చేటు కలుగు' అను నీతినిచూపి కథను విషాదాంతం కావించాడు.

"నీతులపూతలే కరుణంగారి వ్రాతలు" అనుకొంది అరుణం. ఇంకా అతనికథలపై ఆమె ఎన్నో అభిప్రాయాలను సేకరించింది. కథాగమనాన్ని వివిధమైన భంగంవాటిల్లనీకుండా పాఠకులఊహల కతీతంగా కథను ముగిస్తాడు కరుణం. అలాగని సహజత్వానికి దెబ్బరానీయడు. ఆరంభమును, అంత్యమును ఒకేలాగున చిత్రించుటే అతనికథలలో ఒక గొప్పప్రత్యేకత. అతనికథలుచదివిన ప్రతి పాఠకుడూ సంస్కారభావాలనే వాంఛిస్తాడు. కథలోనిపాత్ర చెడ్డదైతే పశ్చాత్తాపమో, ప్రాయశ్చిత్తమో ఆపాత్రకు కల్పించనిదే అతనికి తృప్తి ఉండదు. ఇట్టి విశాలభావాలవల్లనే అతనికథలు ఆమెను ఆకర్షించినవి. కథాపఠనంలో ఆమె లీనమై విచారఘట్టాలలో వలవల ఏడ్చేస్తుంది. హాస్య సంభాషణలందు కిలకిలనవ్వేస్తుంది. కరుణంగారి కథలంటే ఆమెకు ప్రాణతుల్యాలు.

'నివాళి' కథ ముగించిన కొద్ది క్షణాలలోనే చీకటితెరలు లోకముమీదికి ప్రాకనారంభించాయి. అప్పుడే వదినెగారి పిలుపు

పి. వి. యస్. శాస్త్రి

విన్నది అరుణం. ఆమె ఆ ఉద్యానవనాన్ని విడిచింది గాని "జ్యోత్స్న" పత్రికను విడువలేదు. అంతేకాదు, కరుణంగారినికూడ తన హృదయంనుంచి విడిచిపెట్టలేదు. కరుణం ఎట్టివాడో? ఏపాటి వయస్సో? ఏమీ తెలుసుకోకుండా ఎందుకు కడుతోందో యీ గాలిమేడలు?

2

ఆ మరునాడే అరుణం పుట్టినరోజు. ఆ శుభసమయంలో వదినె అనసూయ వాయిల్ చీర కానుకగా ఇచ్చింది. మేనత్త రంగమ్మ బంగారు ఉంగరం పంపింది. మిత్రురాలు సుమిత్ర రత్నం పెన్ సమర్పించింది. ఇలాంటివెన్నో బహుమతులు వచ్చాయి అరుణానికి. అన్నిటికంటె తన అన్నగారు యిచ్చిన కరుణంగారి "కథల కడలి" ఆమెకెంతో ప్రీతిని కూర్చింది. అన్నయ్య తన మనస్సును అర్థంచేసుకొని తగిన బహుమతిని యిచ్చాడని సోదరుణ్ణి ఎంతగానో అభినందించింది. గ్రంథాన్ని తిరగవేస్తూ ప్రకాశకుల "ముందుమాట"నిలా చదివింది అరుణం.

"జగమెరిగిన కథకుడు కరుణంగార్ని గూర్చిగాని, అతని కథలగురించిగాని మేము ప్రత్యేకంగా చెప్పవలసినవిషయాలేమీ లేవు. ... బోర్డు హైస్కూలులో నధ్యాపకునిగా ఉద్యోగించుచు ప్రతినెలా కథల రూపేణా సారస్వత లోకానికి చక్కని సందేశము లంపుచున్నారు కరుణంగారు. వారి సందేశములవన్నియు పొందుపరచి "కథల కడలి" పేరుతో నీ పాత్రము పఠితల కందజేయుచున్నాము. ఈ చిన్ని పాత్రము పాఠకలోకమునకెంతయు నింపుసొంపుల నింపునని మా తలంపు.

ఇట్లు
—ప్రకాశకులు.

అరుణానికి ఒకానొక ముఖ్య విషయానికి మూలకందమయ్యె యీ ముందుమాటలు. కరుణంగారి చిరునామా తనకు లభ్యమగుటయే తడవుగా అతనికిలా జాబు వ్రాసింది అరుణం:

చెంగ్రాలావుపేట,
తే 10-4-'56. ది

ప్రియమైన కరుణంగారికి,

ఆర్యా,

మీ అభిమాన పాఠకురాలు ధన్యవాదములర్పించి వ్రాయు లేఖార్థములు—

మీతో 'కలము చెలిమి' చేయాలనే సహృద్భావంతో ముఖపరిచితి లేకపోయినా నేను మీకీ లేఖను లిఖిస్తున్నందుకు క్షంతవ్యురాలను. మీ కథలు చదువుతుంటే నేనేదో అవ్యక్తానందాన్ని అనుభవిస్తూవుంటాను. 'కలము-చెలిమి' ని మన ఇద్దరిమధ్య నభివృద్ధిచేస్తారని ఆశించుచున్నాను. విశాలభావాలతో కథలు చిత్రించే తాము ఘనమైన సంస్కారం చూపుటకు వెనుదీయరనుకొంటాను. సుదీర్ఘమైన లేఖ వ్రాసి అమూల్యమైన మీ కాలమును వ్యర్థపుచ్చుటకిష్టపడక మీ సమాధానాన్ని కోరుతూ ఇంతటితో యీ లేఖను ముగించుచున్నాను.

ఇట్లు
మీ చెలిమికోరే
"అరుణం"

అయిదవనాటికే కరుణం నుంచి సమాధానం వచ్చింది. పాఠకులపై అతనికెంతటి అభిమానముందో ఆమె ఊహలద్వారా కొలిచి తెలుసుకోలేకపోయింది. నీలిరంగ కవరు, కుడిప్రక్క గులాబీపూవు, ఆణిముత్యాలవంటి అక్షరాలు. ప్రేమికులు వ్రాసుకొనే తీరులోనున్న కవరును చించి ఇలా చదివింది అరుణం!

ప్రత్యక్షంలో పరోక్షం

తేదీ 12-4-1956.

అరుణంగారికి—కరుణం ఆశీస్సులతో వ్రాయు లేఖ—

(పద్యం)

కలిమి చెలిమిని చేయరు—చెలిమి కలిమి!
చెలిమి కలిమిని ప్రోపించు—చెలిమి బలిమి!
చెలిమి బలిమిని సిద్ధించు—కలిమి బలిమి!
కలిమి బలిమిని కనిపించు—వలపుమలుపు!
వలపుమలుపున వినిపించు - వలపుపిలుపు!
వలపుపిలుపును తోలును - తలఁపుతలుపు!
తలఁపు తలుపునకావల — కలికి పలికె
వ్రాయుమన్నది వస్తి జ—జాబు జాబు!

ఇట్లు
మీ అభిమాన రచయిత
"కరుణం"

అహో! కరుణంగారికి కవిత్వం కూడా వచ్చన్నమాట! చక్కని సమాసాలతో, ముక్తపదగ్రస్తాలంకారంతో, తేటతెనుగు పదాలతో, భావకవిత్వం పోకడలో ఎన్నో భావాలు పొదిగి ఎంచక్కా వ్రాశారు! తలుపున కావల కలికి ఎవరు చెప్మా? తలుపున కివలనున్నది గడప. తలుపున కావలనున్నది ఇల్లు. ఇంటిలోని కలికి అంటే ఇల్లాలు కాదు కదా? కాదేమిటి నామొహం! ఆమె చెబితేనే ఆయన నాకీ ఉత్తరం రాశారటకదూ! మరి? భార్య చెబితేనే నాకీ ఉత్తరం రాస్తారన్నమాట! కలిమి చెలిమికికూడా కలికి సిఫార్సు ఉండాలా? భార్యతో పలుకుతున్న పలుకులరాయుడికి నేనెందుకు ఉత్తరం రాయాలి? ఏమిపోగాదు? నాపిలుపు వలపు పిలుపుగా తనకు వినిపించిందంట! ఏమి అభ్యుదయం? సభ్యతెలుగని అభ్యుదయ వాదుల పోకడ లిట్టివేగాబోలు! అసలింతకీ దూరపుకొండల నోయగానికి గౌరవాన్ని పంపించే నేనే అవివేకిని. కరుణంవంటి నేటి బీరకాయ తెందలున్నారో యీ నుచికాల కవిసమూహంలో?

విజయ కళాశాల వార్షికోత్సవంలో "కలం ప్రియ" వాఙ్మసంస్థ నా అభినందనలు తెలిపినప్పుడు మధు ఏమన్నాడు? రాతలకూ, చేతలకూ చాలదూరమని చెప్పాడు. కాను మేటు మధుమాటలలో ఎంతయినా కాచి వడపోసిన సత్యమున్నది. మధు తన వలపు పిలుపుకోసం ఎన్నోకలలు కన్నాడు. తన ప్రేమకోటకు దోసిలొగ్గి దాసోహం చేసేవాడు. తుదకు తెగించి ఒకనాడు "ప్రణయ సామ్రాజ్యలక్ష్మికి ప్రేమలేఖ" అంటూ ఏమేమో వ్రాసి పంపాడు. నీ విషయమై నేనెంతటి త్యాగాన్నైనా చేయగలనని నొక్కి వక్కాణించాడు. అంతకన్నా సంస్కారి ఇంకెవరుంటారు? నీతులు చెప్పి లోకంలో ఖ్యాతిని గడించేకవులే నిజమైన సంస్కారులని, అట్టివారే తన విషయంలో ఎంతైనా త్యాగం చేయగలరని మొదటినుంచి ఒక మూఢ నమ్మకానికి తానుబలియై పవిత్ర హృదయుడగు మిత్రుడు మధుని తూలనాడింది. గుట్టుగారాసిన అతని లేఖనే ఎంతో రట్టుచేసింది. పదిమంది మిత్రులలో మధుని పరాభవించింది. అయినా మధుకేం? మహారాజులా మాలతిని పెళ్ళిచేసుకున్నాడు. గృహాన్ని స్వర్గసీమగా మార్చుకొని అనుకూలంగా విహరిస్తున్నా రాదంపతులు. ఇంతకీ తనే చెడింది.

ఇలా పరి పరి విధాల తలపోసింది అరుణం. ఇంతలో తన చిన్నన్న కృష్ణారావు చెప్పిన మాటలు ఆమెకు గుర్తుకు వచ్చినవి.

"భావకవుల భావాలు సుభావాలు. వారి వ్రాతలకర్థం వారికే తెలియాలి. సాధారణ పాఠకలోకానికి వారి భావాలు కరతలామలకాలు కావు"

అన్నగారిమాటలు యథార్థం కావచ్చును. 'విరాగి' 'విహారి' 'ప్రలాపి' 'పిశాచి' 'కిశోరి' ఇలాంటి భావకవులు వ్రాసిన గేయాలెన్నో తాను చదివింది. పసేమిరా అర్థంకాలేదు తనకు. అందలి పరమార్థం ఆ పరమాత్మునికే ఎరుక అనుకొంది. మళ్ళీ ఉత్తరాన్ని చదివింది. సరాసరి భావకవిత్వం పోకడలోనే ఉత్తరం వ్రాయబడిందని నిర్ధరించుకొంది. "తలఁపు" కుముందుగా "తలుపు" ఉంది. తలుపు కావల కలికి కాదు, తలపు తలుపుకావల కలికి అంటే ఎవరో తనకిప్పుడు అర్థం కావాలి. సాధారణ నిఘంటువులలో సమానయుతమైన ఆ సుదీర్ఘ పదముండదు. ఒకవేళ వున్నా బాహ్యార్థమే ఉంటుందిగాని, అంతరార్థముండదు. ఇలాంటి పదార్థాలు తెలుసుకోటానికి భావకవులవద్ద ప్రత్యేక నిఘంటువు లుంటాయేమో? ఉంటే యీ భావాలకుమల్లే ఇతరులకు సులభగ్రాహ్యం కాకుండా వుండటానికి బ్రహ్మలిపితో వ్రాయబడినవేమో? అని అనేకరీతుల ఊహాగానం చేసింది. అయినా తన సందేహ నివృత్తికి మరో ఉత్తరం వ్రాయుటయే ఉత్తమమని సూత్రించింది అరుణం. వివిధ రంగాలలో తరంగ, తురంగ, తరంగాల కంటె జోరుగా పరుగుతీసిన ఆమె మనో భావాలు ఇప్పటికొక కొలికిలోకి వచ్చి నిలిచాయి! అందుకు మనంకూడా మెచ్చుకొందాం!

3

తే 18-4-56 ది.

కవి మహోదయులు 'కరుణం'గారికి—
'అరుణం' ధన్యవాదములు.
ఆర్యా,

మీరు తేట తెనుగు పదజాలంతో, ముద్దులు మూటకట్టే పద్యంతో, భావకవి



చర్మపు బాధలకన్నిటికి

"సైబాల్"

చర్మవ్యాధు లన్నిటిని శీఘ్రంగా నివారణచేసి, విష క్రిమి నాశనియై త్వరితంగా కుదుర్చుటలో "సైబాల్" ప్రసిద్ధికెక్కింది. కురుపులు, గజ్జి, ఎక్జిమా, స్కాబిస్, మొటిమలు, తామర, కాలిపగుళ్లు, వ్రణములు, మొదలైన వాటిని కుదుర్చడంలో అద్భుతంగా పనిచేస్తుంది.

బిడ్డల ఆరోగ్యమునకు ప్రసిద్ధిచెందినది.

"రమణీస్ బేబీ గ్రైప్"

తయారుచేయువారు:

ది సౌత్ ఇండియన్
మాన్యుఫాక్చరింగ్ కంపెని, మధుర.

డిస్ట్రిబ్యూటర్లు:

సీతారామ జనరల్ స్టోర్సు ఏజన్సీస్
విజయవాడ, సికింద్రాబాద్.
బరంపురం (గంజాం), బొంబాయి. బెంగుళూరుసిటీ.



త్వం పోకడలో వ్రాసిన లేఖ నిన్ననే నాకు చేరింది. నాకు తెలియని క్రొత్తపదాలంటూ అందులో ఏమీ లేవు. పదాలు తేనె సోనలులా ఉన్నా, భావం జిగిబిగిగా వుంది. అందుచే మీ లేఖను సరిగా అర్థం చేసుకోలేకపోయానని తెల్పుటకు చింతించుచున్నాను. దయవుంచి మీ కలికి పేరేమిటో తెలుప గోరెదను.

ఇక సెలవు!

ఇట్లు

"అరుణం"

* * *

తేదీ 15-4-1956

ప్రియమైన 'అరుణం' గారికి

'కరుణం' ప్రేమతో వ్రాయు లేఖ-మీరు నా లేఖలోని భావం గ్రహించలేక పోయినందుకు మీ చింతలో నేనుకూడా వంతు గైకొన్నాను. తెరమఱుగు భావాలతో నేను పద్యం వ్రాయలేదు. భావ కవిత్వం కాదని ఖచ్చితంగా చెప్పగలను. మీరు ఏదో ఆవేశంలో నన్ను అపార్థం చేసకొన్నారు. ప్రతిపదాన్ని చక్కగా గమనిస్తే అర్థం కాఅకు చేసిన ప్రయత్నం వ్యర్థం కాగు. నాకు కలికి అంటూ లేదు. ఇంకా నేను బ్రహ్మచారినే. నా పద్యంలో మీ అనుమానానికి తావుకూడా లేదు. అక్కడే మీరు పెద్దపొరపాటు పడ్డారు. నాకు మిత్రులెందరో వందలకొద్ది వున్నారు. మిత్రురాండ్రుమాత్రం లెక్కకు లేరు. ఏకైక మిత్రురాలు మాత్రం గలదు. ఆమె పరమ పవిత్రురాలు. అంతేకాదు నా అభిమాన పాత్రురాలు కూడా. ఆమె నా హృదయాన్ని కౌగిలించింది. నా కలికి పేరుకు బదులుగా ఆమెపేరును తెలుపుతున్నాను. త్వరలో నాకు సామ్రాజ్యలక్ష్మి కాబోతున్న అమ్మలమిన్న, అందాలతిన్న, లక్ష్మి సంపన్న, శారదా ప్రసన్న యగు నా మిత్రురాలి పవిత్ర నామము "—రాగం" అంటే "వరాగం" కాదు. "పరాగం" కూడా కాదు. "అనురాగం" అంతకన్నా కాదు. "సంగీతరాగం" కానేకాదు. నా ప్రియురాలిపేరు "సంధ్యారాగం". ఆమెతో మీకు వవేమిటి కలిగిందో చెప్పండి. ఇక వుంటాను.

ఇట్లు,

మీ అభిమాన రచయిత

"కరుణం"

* * *

ఏమిటీ లేఖలోని పోకడలు ? కలికి లేదట! ప్రియురాలు కలదట ! ఆమెతో నాకేమిటి పనట ! పైగా నన్ను "ప్రియమైన" అంటూ సంబోధించటానికైనా సిగ్గులేకపోయింది ! మాటలకు ప్రాసలుతొడిగి తన ప్రియురాలి నెంతచక్కగా వర్ణించాడు ! అట్టివాడు నా మనోలక్ష్యాన్ని ఎలా గుర్తిస్తాడు ? గుర్తించినా నన్ను చేబట్టుటకు ఎంతటి సంస్కారి కావాలి ! చేతనున్న విరజాజిని విడిచిపెట్టి, దూరానవున్న కొండమల్లెను కోరుతాడా ఎంతటి వెఱ్ఱివాడైనా ? సంధ్యారాగం త్వరలో తనకు సామ్రాజ్యలక్ష్మి కాబోతుందని వ్రాశాడు. నాకెందుకింకా యీ వెఱ్ఱితలపులు...పిచ్చిభ్రమలూను.

అంతటితో అరుణం ఊహాగానం ఆగిపోయింది. ఆమెహృదయ వీణలోని ప్రేమ తంత్రులు తెగిపోయినవి. మెట్లులేని గాలి మేడలు కూలిపోయాయి. పగటికలలు భగ్నమయాయి. అంతే ! కరుణం గారి కొక గుడ్ బై ! అతనికథలకో గుడ్ బై ! ఆగిందామె ప్రణయకలం ! పెట్టింది పత్రికలకో సలాం !

అందినతీపి !
అందక పులుపు !
ఎవరిపై యీ అలుక ?
ఎందుకో యీ నాంత ?
దేనికో యీ కలత ?
ఏమౌతుంది నెలత ?
పూర్తికాలేదు కథ !

4

కాలప్రవాహంలో ఆరుమాసాలు ఆరు తరంగాలలా దొరలిపోయాయి. ఇప్పుడు పత్రికా చింతనమే లేదు అరుణానికి. పాఠక పుస్తకాలపై ఎక్కువ శ్రద్ధ చూపింది. తత్ఫలితంగా పరీక్షలో బ్రైట్ మార్కులు సంపాదించింది. పరీక్షల అనంతరం మేనత్త గారింటికి గజపతినగరం వెళ్ళుటకు వాల్తేరు స్టేషనులో బండి ఎక్కింది. మరో పావు గంటలోనే బండికదిలింది. కిటికీలోంచి ప్రకృతి లావణ్యాన్ని తిలకిస్తూ కూర్చుంది అరుణం. దూరాన కొండలు ఎంతోనున్నగా కన్పిస్తున్నవి. వాటిని చూడగానే కరుణం స్ఫురణలో మెదిలాడు. మళ్లీ ఆమెమనస్సు కలుక్కుమంది. అంతలోనే ఏదో ఊహ తళుక్కుమంది.

ఆరుమాసాలై కరుణంగారి కథలు చదవలేదు. ఇప్పుడెలా ఉన్నాయో అతని భావాలు ? అనుకొంది. మళ్లీ అభిమానం దెబ్బతింది. సింహాచలం స్టేషనులో బండి నిలిచింది. కొందఱు ప్రయాణీకులు దిగారు. వారిస్థానాలను మఱికొందఱు క్రొత్తవారు ఆక్రమించారు. తనకెదుటిసీట్లో బొద్దు మీసాల వీరభద్రావతారం దిగిపోయాడు. అతనిసీట్లో ఒక నవయువకుడువచ్చి కూర్చొన్నాడు. అతడు తొడిగిన సిల్కులాల్చీ గాలికి రెపరెప లాడుతోంది. తుమ్మెదలలా శిరోజాలు లలాటంపై లాస్యంచేస్తున్నాయి. బంగారు సులోచనాలగుండా లోచనాలు తళతళ మెఱుస్తున్నవి. స్ఫురద్రూపి, నవ్వుముఖం, తెల్లని ఛాయ, నూనూగుమీసం...అంతే ! నఖశిఖ పర్యంతం ఒకేసారి అతనిరూపాన్ని చూసింది అరుణం. అతనిచేతిలో ఏవో పత్రిక ఉన్నది. ఔను ! అది 'జ్యోత్స్న' పత్రికే. అబద్ధం కాదు. అడుగుదామనుకొంది. కరుణంగారి ప్రియురాలు సంధ్యారాగం మళ్లీ జ్ఞప్తికొచ్చింది. ఆమె తన్నుచూసి వికటాట్టహాసం చేస్తూ వెక్కిరించినట్లు లీలగా ఊహించింది. మళ్లీ ఆమె అభిమానం దెబ్బతిన్నది. అడగలేకపోయింది. అతడు పత్రికా పఠనంలో నిమగ్నుడయాడు. బండి పెందుర్తి, కొత్తవలస స్టేషన్లు దాటిపోయింది.

అరుణం మళ్ళీ ప్రశ్నించుకొంది :

కరుణంగారి కథ లెందుకు చదవకూడదు ? ఆయన చేసిన తప్పేమిటి ? అతడూ మానవ

పూవు మీ అదృష్టం చెప్పగలదు

నీ భవిష్యత్తులో ఏమి జరుగబోవునదిన్నీ, నీ సరియైన చర్యనుగురించిన్నీ నీవు తెలుసుకొనగోరినట్లయితే ఒక పోస్టు కార్డుపైన నీకు యిష్టమగు ఒక పువ్వుపేరున్నూ, నీవు వ్రాయు తేదీ, వేళ వివరములున్నూ, నీ సరియైన చిరునామాయున్నూ వెంటనే వ్రాసి పంపుము.

జ్యోతిష శాస్త్రములోని రహస్య గణితము మూలముగా మేము గుణించి, నీవు కార్డువ్రాసిన తేదీలగాయతు 12 మాసములలోను నీయొక్క అదృష్టము, లాభనష్టములు, జీవితమార్గము, ఏ వ్యవహారములో నీకు జయము కలుగునో, నీ ఉద్యోగం విషయంలో మంచిచెడ్డలు, మార్పులు, ఆరోగ్యవిషయము, పరదేశగమనము, తీర్థయాత్రలు, వివాహము, స్త్రీసుఖము, సంతానము, నిధినిక్షేపములు, లాటరీ, అకస్మాద్ద్రవ్యలాభము మొదలగు వానినిగురించి స్పష్టముగా మాసవారీగా వ్రాసి రు. 1-4-0 లకు మాత్రము వి. పి. గా పంపగలము. (వి. పి. ఛార్జీలు ప్రత్యేకం) దుష్టగ్రహము లేనయినా వున్న యెడల శాంతిచేయు విధానంకూడా తెలుపబడును. వివరములు మా పూచీపైన పంపబడును. మేము పంపిన భోగట్టా మీకు తృప్తిగా నుండనియెడల సైకము వాపసు చేయబడును. ఒకసారి పరీక్షించిచూడుడు. మీ అడ్రసు ఇంగ్లీషులో వ్రాయండి.

Pt. DevDutt Shastri, Raj Jyotishi (WP-13) Jullundur City.

★ ప్రత్యక్షంలో పరోక్షం ★

మాత్రమే! అందరికీ మల్లే అతనికీ ఓ ప్రియురాలు ఉంటుంది. ఆమెపై నాకెందుకని? అతని రెండవ ఉత్తరానికి నేను జవాబు ఇయ్యనందు కేమనుకొన్నాడో?... అని ఆమె ఆలోచిస్తుండగా ఎదుటి సీట్లోని యువకుడు పత్రికను తన స్థానంలో ఉంచుతూ తాను తలుపువద్దకుపోయి నిలుచున్నాడు.

అరుణం ధైర్యంతో అతని పత్రిక తీసింది. తలుపువద్ద నిల్చొన్న ఆ యువకుడు ఆమె చర్యను తిలకిస్తూనే ఉన్నాడు. కుదురైనమీసాము, వదులుగానున్న జడ, తెల్లరంగు లంగాపై నల్లని సిల్కువెల్వెట్, లేతగులాబి కలర్ జాకెట్, మెడలో తళతళ మెరిసే తెల్లపూసల నెక్లెస్, చిరునవ్వుతో తొణికిసలాడే పెదాలు, పూర్ణమైన కపోలాలు, జ్యోత్స్న కాంతులు వెదజల్లే నేత్రాలు... ఆమెయొక్క అన్ని హంగులూ ఒకే ఒక్క చూపుతో గ్రహించాడు యువకుడు. వెంటనే తన సీట్లోకి వచ్చి కూర్చొన్నాడు.

ఆమె హరిణములా బెదరుచూపులు ప్రదర్శిస్తూ "క్షమించండి. మీ పర్మిషన్ లేకుండా పుస్తకం తీశాను" అంటూ ఇచ్చివేయబోయింది.

"ఫరవాలేదు చదవండి. పత్రికలపై మీకుంటే అభిమానంకొద్దీ అలా తీశారు." అన్నాడు యువకుడు.

"నవనీత హృదయుడు" అనుకొంది అరుణం.

"కరుణంగారి కథలపై మీ అభిప్రాయమేమిటి?" యువకుణ్ణి సూటిగా ప్రశ్నించిందామె.

"ఆ పత్రికలో చదవండి మీకే తెలుస్తుంది. పతితల పాలిటి రచయితలకు వరహాలంటూ వివిధ పాఠకులు తన కిచ్చిన అభిప్రాయములను సంఘటీకరించి "కృతజ్ఞత" అనే కథానికగా చిత్రించారు కరుణంగారు. అతని కథలపై ప్రత్యేకంగా నేనిచ్చే అభిప్రాయమేమీ లేదు. విశ్వాన్ని వేయి కండ్లతో విమర్శించి కరుణంగారు "కథలు రాస్తారు. సమాజంలోని వ్యక్తులయొక్క వివిధ సమస్యల ప్రతిరూపాలే అతనికథలు. అతన్ని పొగిడి చెప్పడం నా కిష్టంలేదు. తెలుసుకోవాలని కుతూహల ముంటే పత్రిక చదవండి," అన్నాడు యువకుడు. "కృతజ్ఞత" కథలోని పతితల పేర్లలో తనపేరు కూడా ఉంటుందేమోనని కళ్లు పెద్దవిచేసి చూసింది అరుణం!

"..........పత్రికా వ్యాసంగంలో నాకు పరిచయమైన మిత్రుల సంఖ్య వేల కతీతంగా వుంది. ఇటీవల ఒక్కగానొక్క మిత్రురాలు మాత్రం నాకు తారసపడింది. నా హృదయసామ్రాజ్యానికి అధినాయిక కావాలని కాంక్షతో ఆమె నాకు లేఖ లిఖించిందని గ్రహించడానికి నా కెంతో సేపు పట్టలేదు. లేటతెనుగు పదాలతో, ఆమె కర్థమయే రీతిగా, ఆమెను సంతృప్తి పరచాలని పద్యరూపేణా సమాధానమిచ్చాను నేను కానీ నా ప్రయత్నం విఫలమయింది. ఆమె నా పద్యాన్ని అంతరార్థంతో తర్కించకుండా అపార్థం చేసుకొంది. అది వైపరీత్యానికి దారి తీసింది. రెండవ లేఖలో మీ కలికి పేరేమిటి? అంటూ నన్ను ప్రశ్నించింది. బ్రహ్మచారిగా నున్న నేను నాకలికి పేరు ఏమని చెప్పేది? ఆలోచించాను. నా ప్రియురాలి పేరు "సంధ్యారాగం" అంటూ వ్రాశాను. పాపం! సంధ్యారాగమను పేరు తన పేరునకు పర్యాయపదమని గ్రహించలేక నాకు అంతటితో లేఖలు వ్రాయటం మానుకొంది అరుణం...... ..."

"ఆఁ! ఇందులో నా గురించి కూడా వ్రాశారు." ఆనందోద్రేకంతో అనేసింది అరుణం. తర్వాత మళ్లీ సిగ్గుపడిపోయింది.

"ఏమిటీ? మీరు అరుణంగారా?" అంటూ ఆశ్చర్యంతో ప్రశ్నించాడు యువకుడు.

"నా పేరు మీకెలా తెలిసింది?" అంటూ అతనివే కిలా ప్రశ్నించింది అరుణం.

"సంతోషంతో ప్రపంచాన్ని మరచిపోతున్నట్లున్నారు. ఆ కథలో పది మంది స్త్రీలున్నారు గనుక నా మీ పేరు తెల్సుకో లేక పోడానికి? ఆ కథలో మీ గురించి వ్రాశారని మీరే చెప్పారు. అందులో ఉన్న ఒక్క స్త్రీ అరుణం మాత్రమే. కనుక మీరు అరుణంగారని గ్రహించాను."

అతని జవాబుతో తన తప్పు తెలుసుకొని తలదించుకొంది అరుణం! అతడే మళ్లీ ప్రశ్నించాడు—

"ఇంతకీ కరుణంగారికి కలికి ఉంటుందనే అనుమానం మీ కెందుకు కలగాలి?"

సమాధానంగా కరుణం వ్రాసిన తన్న లేఖనంతా వినిపించి తన అనురాగాన్ని వ్యక్తపరచింది అరుణం. ఆ యువకుడొక్క

మెక్లీన్సు యింతకు ముందుకంటె పళ్లను తెల్లగా శుభ్రపరుచును!



మారు చిన్నగా నవ్వుగా నవ్వి మిన్న కున్నాడు.

"ఎందుకు నవ్వారు?" ప్రశ్నించింది.

"మీ అమాయకతకు" జవాబిచ్చాడు.

"అందులో నేను పొరబడినదే ముంది?" మళ్ళీ ప్రశ్న.

"చాలా వుంది" అతని సమాధానం.

"ఏమిటది?" మళ్ళీ ప్రశ్నించింది.

"తలుపు కావలకలికి అంటే మీరు అను కొన్నట్లు "ఇల్లాలు" అను అర్థం వస్తున్నది. కాని, తలపు తలుపుకావలకలికి అంటే ఆ అర్థంరాదు." అన్నాడు.

"మరి?" ఆతురతతో ప్రశ్నించింది.

"తొందరెందుకూ? చెబుతానువుండండి. తలపులు అంటే కోరికలు. కోరికల నే తలపుల కావలమన్న కలికి ఎవరో తెలుసు కొనుటకై మెదడుకు మేతవెయ్యండి. ఇంకా తెప్పుకోలేరా? ఆ కలికి అతని "మనస్సు" అని తెలుసుకోండి. తన మనస్సు చెబితే నే మీకొ ఉత్తరం వ్రాశారు కరుణంగారు. మీకు సులభంగా 'తలపు' అర్థమయేందుకు తలపు అనుచోట లాతర్వాత అరసున్నా కూడా ఆయన రాసి వుండవచ్చును..."

"ఔను. రాశారు. నాకు జ్ఞాపకముంది"

"అరసున్నా ఒకప్పుడు నిండు సున్నా వలె అర్థమిస్తుందని మీకు తెలుసు ననుకొంటాను. 'తలఁపు' 'తలంపు' అవుతుంది. 'తలంపు' అనగా 'కోరిక' అని సులభంగా మీరు గ్రహిస్తారని కరుణంగారు అరసున్నా పెట్టి వుంటారు."

అతని సమాధానానికి తృప్తి చెందింది అరుణం. ఒక్క నిట్టూర్పు విడిచింది. "నేనెంత తెలివితక్కువపని చేశాను"అంది.

"అయినా ఫరవాలేదు. విచారించకండి" అన్నాడు యువకుడు.

"ఏం?" అరుణం ప్రశ్నించింది.

"అతని కింకా పెళ్లి కాలేదు." ఆసక్తితో సమాధానమిచ్చాడు.

"అయితే?"

"అయితే, గియితే ఏమీలేదు. మిమ్మల్ని తప్ప మరెవ్వరినీ ఆయన పెళ్లిచేసుకోడు."

"నా పూర్తి కథ తెలుసుకొన్నాక కళ్లు మిటకరిస్తారేమో ఆ పెళ్లికొడుకు?"

"కారణం?"

"తగిన సంస్కారం చూపలేక."

"అతని విషయంలో మీరు చాలా పొరబడుతున్నారు. జాతి, మత, శాఖా విభేదాలాయనకు లేవు."

"లేక పోవచ్చు."

"విధవా వివాహం చేసుకోడానికైనా ఆయన వెనుదీయడు."

"బోస్వమాడుతున్నారా? లేక వెక్కిరిస్తున్నారా? ఆయన విషయాలన్నీ మీకెలా తెలిశాయి? అనుమానంతో ప్రశ్నించింది అరుణం.

"ఆయన నా సహాధ్యాయుడు. మీరు తెలుగుపదాలు సరిగా అర్థంకాక పోతే 'కోటీశ్వర్' అని తెలుసుకోండి.

అతని జవాబులో తనపై కొద్దిపాటి వ్యంగ్యం వున్నా పరిస్థితులవల్ల లొంగి ఏమీ అనలేకపోయింది అరుణం.

"మీది ఆయన ఊరేనా?" అంటూ మళ్ళీ ప్రశ్నించింది.

"అనుమాన నివృత్తికోసం చొప్పదంటు ప్రశ్నలు వేస్తున్నారు. మీపై ఉంటే అభిమానం కొద్దీ నాకు తెలిసినవిషయం చెప్పినందుకు నాగానే పరాభవించి నన్ను క్రాస్ ఎగ్జామినేషన్ చేస్తున్నారు." నటనా పటిమలో కూడిన చిరుకోపం అతని నేత్రాలలో ద్యోతకమయింది.

"క్షమించండి. ఏదో తెలీక అన్నాను. తమపట్ల నేను అపార్థం చేసుకొన్నందుకు నన్ను క్షమించమని కరుణంగారితో చెప్పండి అతని చరణదాసిని కావటమే నా జీవితాశయమని చెప్పండి. నా ప్రేమపూర్వకమైన ధన్యవాదాలను తెలియజెయ్యండి. త్వరలోనే జాబు వ్రాస్తున్నానని చెప్పండి."

"మీకెందుకీ తొందరండీ? ఇంతకీ నాకు మీ కానుకేమిటో చెప్పండి." నవ్వుతూ యువకుడు ప్రశ్నించాడు.

"నా పెళ్లికి తప్పకుండా రండి. అప్పుడు మీకు మంచి కానుక ఇస్తానులెండి."

"నేను లేకుండా మీ పెళ్లి జరుగదు లెండి. బండి విజయనగరం వచ్చిందండి. నాకిక్కడ చాలా పనులున్నాయండి. వస్తా నండి." అంటూ యువకుడు బండి దిగి పోయాడు. రెండుమూడుసార్లు వెనుదిరిగి చూశాడు. అరుణం తన వేపే చూస్తోంది. ఆ చూపులలో "నేను చెప్పినవిషయాలు మరచి పోకండి" అను భావం పొంచివున్నదని గ్రహించాడు. కొద్దిక్షణాలలోనే అతడామె దృష్టిపథానికి దూరమయ్యాడు.

5

అరుణం గజపతినగరం నుంచి విశాఖపట్టణం వచ్చేక అన్నయ్య కృష్ణారావు ముసిముసి పసిడినవ్వుల నొలికిస్తూ ఒక ఉత్తరాన్ని ఇచ్చాడు. ఆ ఉత్తరము చదివిన అరుణానికి సిగ్గు, భయము, సంతోషము, ఆశ్చర్యం అన్నీ ఒక్కక్షణంలోనే యేర్పడినవి.

తేదీ 5-11-56

ప్రియమిత్రుడు కృష్ణారావుకు..

ద్రోణంరాజు దయాకరరావు వ్రాయు లేఖ.

చాలకాలమయింది మన ఇద్దరి నడుమ ఉత్తరాల ప్రయాణం లేదు. మళ్ళీ నీ చిన్న చెల్లెలు అరుణం దయవల్ల నీకీ లేఖ వ్రాయ వలసి వచ్చింది.

చూడు!

లోగడ నీ పెద్ద చెల్లెలు వెధవ్యను నాకిచ్చి పెళ్ళి చేయమన్నాను. విధవను కిచ్చి శాఖాంతరవివాహం చేయడానికి మీ అన్నయ్య రామారావు అంగీకరించడన్నావు. మీ అన్నయ్య ఏలూరుకు బదిలీఅయి వెళ్ళిన తర్వాత నీవు స్వతంత్రుడవయావు. అందుకు నిదర్శనం నీ విధవ చెల్లెలు అరుణం సత్యాలంకారశోభిత కావటమే. నీ సంస్కారగుణానికి నేనెంతో అభినందిస్తున్నాను. మీ చెల్లెలు అరుణం నన్ను మనసారా ప్రేమించింది. నా పేరు కరుణం అని నీవు గ్రహించి వుంటే, ఆమె నన్నెలా ప్రేమిస్తుందో తన వద్ద వున్న పత్రికలే నీకు నిదర్శనాలు. మొన్న రైలుప్రయాణంలో పెండ్లి కాక పూర్వం సుభద్రార్జునులు మాట్లాడుకొన్నట్లుగా మేముకూడా మాట్లాడుకొన్నాం. అయితే నేను అర్జునుడనని మీ సుభద్రకు తెలీదు పాపం. శుభస్యశీఘ్రం అనిపించాలి. త్వరలోనే నీవు కృష్ణపాత్ర ధరించాలి. మీ అన్న రామారావు (బలరాముడి)కి యీ వార్త తెలుపకుండా సింహాచలందేవస్థానంలో పెళ్లిసన్నాహాలు రహస్యంగా జరిపి నాకు తంతివార్త పంపించు. నీ చెల్లెలి భావి భాగ్యోదయానికి యీ విధంగానైనా సహకరించు. జవాబు జరుగుగు.

ఇట్లు

నీ మిత్రుడు-దయాకర్

★

కలవరపడు స్త్రీలకు

"కుమారి" మాత్రలు మరువకండి. మీ ఆరోగ్యం రక్షించును చింతఅవసరం
వెల (సాదా) రు. 3/-
(స్పెషల్) రు. 5/-
(ఎక్స్ట్రా స్పెషల్) 8/-
పోస్టేజిప్యాకింగుప్రత్యేకం

Mrs. P. Devee, F.D.S. (AP) Calcutta-6.

Stockists —(1) Indo Medical Supplies, 3, Pauliappan St., G. T. Madras;
(2) L. M. Mukerji & Sons Ltd., 167, Dharamtola St., Cal—13.

నంజనగూడు పండితవారి
జ్వరేఘ్
సకల జ్వరములను అద్భుతముగా నివారించును.
క్యాటలాగ్ ఉచితము
సోలేజంటు: యునైటెడ్ కెమికల్స్, మదరాసు-1
బ్రాంచీలు: హైదరాబాదు & విజయవాడ.